క్లుప్తంగా

200 మంది విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ



బస్ పాస్‌లు పొందిన విద్యార్థులతో..

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు సోమవారం ఆ పాఠశాలలో బస్ పాస్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వై.సత్యనారాయణ చేతుల మీదుగా 200 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. విద్యార్థుల బస్ పాస్‌లకు అయ్యే మొత్తాన్ని వితరణగా సమకూర్చిన డాల్ఫిన్స్ సంస్థ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజరు వైఎస్ఎన్ మూర్తి, ఎంఈఓ–2 భగవతి, హెచ్ఎం కోమలి చిత్ర, విద్యా కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, ఆర్టీసీ పీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు సోమవారం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇంటర్ విద్యార్థినులకు యూనిఫాం అందజేత



యూనిఫాం అందిస్తున్న శ్రీకృష్ణ దేవరాయులు, హెచ్ఎం పద్మజ తదితరులు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు 30 మందికి యూనిఫాం అందజేశారు. అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పోశిన శ్రీకృష్ణదేవరాయులు తన సొంత నిధులతో విద్యార్థినులకు ఈ యూనిఫారం సమకూర్చారు. ఆ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనే స్వయంగా విద్యార్థినులకు ఈ యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ , ఉపాధ్యాయుడు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

79 మందికి కొత్త రేషన్ కార్డులు



సూర్యారావుపాలెంలో కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులతో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య, ఎంపీపీ యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరవుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. మండలంలోని సూర్యారావుపాలెం, పాలంగి, చివటం, కె.సావరం గ్రామాలకు కొత్తగా 79 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వారిద్దరూ సోమవారం నాలుగు పంచాయతీలకు వెళ్లి, ఆయా సచివాలయాల వద్ద లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కొఠారు సత్య నారాయణ, ఎంపీటీసీ సభ్యులు పి.వెంకటలక్ష్మి, దిద్దుపూడి వీస్సు, మీసాల సురేష్, బస్వా సర్వేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు మళ్లీ వేస్తాం



వర్షాలకు పెద్దగూడెంలో దెబ్బతిన్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

గోపాలపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న సీసీ రోడ్లను మళ్లీ నిర్మిస్తామని పంచాయతీరాజ్ ఏఈ కె.పవన్‌కుమార్ వెల్లడించారు. గోపాలపురం గ్రామంలోని పెద్దగూడెం ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న సీసీ రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడం వల్ల సీసీ రోడ్డుపై రాళ్లు లేచిపోయాయని తెలిపారు. మరలా రెండు అంగుళాల మందంతో, అర మీటరు వెడల్పున ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన గ్రామస్తులకు వివరించారు. మండలంలోని రోడ్లన్నింటినీ నాణ్యతా ప్రమాణాలతో వేశామని చెప్పారు. నీరు నిలిచిపోయిన పెద్దగూడెంలో మాత్రమే రోడ్డుపై రాళ్లు లేచినట్టు పవన్‌కుమార్ చెప్పారు.

వీడని ముంపు.. అన్నదాతకు కష్టం

- లంక గ్రామాల రైతులకు అపార నష్టం
- కూరగాయల పంటలు కుళ్లిపోయే ప్రమాదం
- తీగ జాతి పంటలదీ అదే పరిస్థితి



ముక్కామల లంక భూముల్లో జల దిగ్బంధంలో చిక్కుకున్న పంటలు

పెరవలి: రోజుల తరబడి ఉద్యాన పంటలు గోదావరి ముంపులో ఉన్నాయి. దాంతో వాటిపై మండలంలోని లంక గ్రామాల రైతులు ఆశలు వదులు కుంటున్నారు. రూ.లక్షలు పెట్టుబడిగా పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు తమ కళ్లెదుటే పాడైపోతుండంతో వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మరోపక్క గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నుంచి సుమారు 15 లక్షల క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడిచి పెట్టారు. ఆ వరద ప్రభావంతో మండలంలోని ఎగువ, దిగువ లంక భూములన్నీ సోమవారం కూడా నీటిలోనే ఉన్నాయి. కూరగాయల పంటలు కుళ్లి పోయే స్థితికి చేరుకున్నాయని రైతులు చెబుతున్నారు. కంద, పసుపు పనికిరావని అంటున్నారు.అరటి తోటలు ఉన్నా గెలలకు మట్టి ఉండడం చేత మార్కెట్‌లో ధర లభించదని చెబుతున్నారు. పూల తోటలు, ఆకుకూరలు, మిరపతోటలు నామరూపాలు లేకుండా పోతాయని రైతులు పేర్కొంటున్నారు. దొండ, బీర, ఆనబ, పొట్ల పందిర్లు నీటిలో మునగడం వలన నీరు తీసేసినా పాదులు చనిపోతాయని ఆ రైతులు చెబుతున్నారు. లంకల్లో నీరు పూర్తి స్థాయిలో లాగడానికి వారం రోజుల సమయం పడుతుందని అప్పటికి పంటలేవీ పనికి రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాకరపర్రు లంకలో నీట మునిగిన పంటలు



కానూరు లంకలో నీట మునిగిన జామ తోట



ముక్కామలలో నీట మునిగిన షెడ్డు

మంత్రి వనిత దృష్టికి ముస్లింల సమస్యలు

తాళ్లపూడి: ముస్లిం నాయకులు సోమవారం కొవ్వూరులో హోం మంత్రి తానేటి వనితను కలసి కొవ్వూరు నియోజకవర్గ ముస్లింల సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. పలుచోట్ల ఖబరిస్తాన్‌లకు ప్రహరీల నిర్మించాలని, మసీదుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆమెకు వినతి పత్రం సమర్పించినట్టు తాళ్లపూడి మసీదు కమిటీ చైర్మన్ సర్దార్ తెలిపారు. ముస్లిం మతపెద్దలు ఎండీ రఫీయుల్లా బేగ్, పలు గ్రామాల ముస్లింలు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు గోపాలపురానికి మంత్రి వనిత

గోపాలపురం: గోపాలపురంలోని కొండవీటి డిగ్రీ కళాశాలలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని ఆ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్‌డీ ఆశీర్వాదం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మూడు గ్రామాల్లో మంత్రి పరామర్శలు



ఊనగట్లలో సర్పంచ్ వెంకట్రావుతో మాట్లాడుతున్న మంత్రి వనిత

చాగల్లు: మండలంలోని కలవలపల్లి, ఊనగట్ల, నందిగంపాడు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను, అనారోగ్యం పాలైన వైఎస్సార్ సీపీ శ్రేణులను సోమవారం హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలవలపల్లిలో సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివన్నారాయణ, గగ్గర ప్రసాద్, చల్లా చంద్రరావు, దిగుమర్తి నాగరాజుల గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఉప సర్పంచ్ కొండేపాటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఊనగట్లలో సర్పంచ్ మట్టా వెంకట్రావు, పిల్లి నాగరాజు, గూడూరి నాగేశ్వరరావు, వావులపల్లి పోలరాజు కుటుంబాలను సందర్శించి మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యురాలు బొల్లా ధనలక్ష్మి, కంకటాల శ్రీనివాసరావు, మెరిపో సూర్యచంద్రం, కొయ్యలమూడి వీర సత్యనారాయణ పాల్గొన్నారు. నందింగపాడులో అనారోగ్యానికి గురైన సర్పంచ్ కుదప రాంబాబుతో మంత్రి తానేటి వనిత మాట్లాడి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవధ్యాక్ష, అధ్యక్షులు, జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు సుంకర రాయుడు, మేకా సురేష్, వీరవల్లి శివ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

- హోం మంత్రి తానేటి వనిత
- 10 మందికి మూడు చక్రాల మోటార్ సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు పంపిణీ చేసిన హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమంతో పాటు దివ్యాంగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పది మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక్కో వాహనానికి రూ.1.20 లక్షల చొప్పున ప్రభుత్వం రూ.1.20 కోట్లు వెచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,750 మంది దివ్యాంగులకు ఇలాంటి మోటార్ సైకిళ్లు అందిస్తున్నట్టు చెప్పారు. దివ్యాంగులైన విద్యార్థులు, నిరుద్యోగులు, చిరు వ్యాపారాలు చేసుకునేవారు ఒక చోట నుంచి మరో చోటికి వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇలాంటి మూడు చక్రాల మోటార్ సైకిళ్లను అందిస్తోందన్నారు. లబ్ధిదారులతో మంత్రి వనిత కొద్దిసేపు మాట్లాడి, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పలువురు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

కొవ్వూరు: నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహామూర్తి కోరారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రంగంపై ఆధారపడి 35 లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. గృహ నిర్మాణదారులు కట్టే సెస్‌ను కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుందరబాబు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతాలు నిర్వహిస్తామన్నారు. కార్మికుల సమస్యలపై జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను కలిసి వినతి పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య, నాయకులు మైగాపుల నాగేశ్వరరావు, ఉప్పే కేదార్, బొంగు భద్రం, నిమ్మన శ్రీను, వీరా త్రిమూర్తులు, సిద్ధిరెడ్డి బాపిరాజు, ఎస్‌కే ఆదామ్, ఎస్‌వీ సుబ్బారావు,ఆకుమూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- నిడదవోలు కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు
- అజెండాలోని 36 అంశాల ఆమోదం



సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: ప్రస్తుత వర్షా కాలంలో పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సూచించారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. అజెండాల్లో పేర్కొన్న 36 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ పట్టణంలో వర్షపు నీరు, మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్న కమిషనర్ కేవీ పద్మావతి, ఇంజినీరింగ్ అధికారులను అభినందించారు. విపక్ష కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు మాట్లాడుతూ భీమదొర తూము ప్రాంతంలో పూడిక తీయించే విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్నారు. నాలుగు వార్డులకు ప్రధాన సమస్య అయిన భీమదొర తూములో ఎందుకు పూడిక తీత చేపట్టలేదో చెప్పాలని పట్టుబట్టారు.మున్సిపాలిటీకి చెందిన జేసీబీని కొందరు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారని గారింకి ఆరోపించారు. దీనిపై మున్సిపల్ డీఈ మాధవి లత, ఏఈ హేమంత్‌కుమార్ బదులిచ్చారు. వర్షాలు అధికంగా కురవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందని త్వరలో పూడికతీత పనులను ప్రారంభిస్తామన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు

పాటిమీద సెంటర్ నుండి గణపతి సెంటర్ వరకూ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్లకు ఇరుపైపులా ఇంటర్ లాకింగ్ టైల్స్ వేయడానికి సాధారణ నిధులు రూ. 52.80 లక్షలు కేటాయించారు. అన్నపూర్ నగర్‌లో మూడు గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి సాధారణ నిధులు రూ.ఐదు లక్షలు కేటాయించారు. పట్టణ శివార్లలోని ఇరిగేషన్ శాఖ స్థలాన్ని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జడ్జి బంగ్లాల నిర్మాణాలకు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. తొమ్మిదో వార్డులో డ్రైన్ నిర్మాణానికి రూ. 7 లక్షలు, 8వ వార్డు చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ డ్రైన్ నిర్మాణానికి రూ. 10.30 లక్షలు మంజూరు చేశారు. మంచినీటి పైపులైన్, పంపింగ్ మెయిన్ లైన్ లీకేజీల పనులకు రూ. 8.46 లక్షలు కేటాయించారు. వీధి దీపాల నిర్వహణ కోసం రూ.4.3 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగడ బాలరాజు వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరా చేయాలి

దేవరపల్లి: మండల స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్) నుంచి బియ్యాన్ని కచ్చితమైన తూకంతో రేషన్ డీలర్లకు ఇవ్వాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ గోపాలపురంలోని పౌరసరఫరాల మండల స్థాయి గిడ్డంగి అధికారికి సూచించారు. సోమవారం గిడ్డంగిలోని కాటాను దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రేషన్ డీలర్లు, గిడ్డంగి అధికారి సమక్షంలో తనిఖీ చేశారు. కాటా సక్రమంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. తూకం పెట్టకుండా బియ్యం రేషన్ దుకాణాలకు పంపించవద్దని ఆదేశించారు. ప్రతి బస్తా 50.580 కిలోలు ఉండాలని గిడ్డంగి అధికారి వెంకటేశ్వరరావుకు సూచించారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, వై. నాగేశ్వరరావు, నరసింహమూర్తి, డీలర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యోగుల ప్రదర్శన

నల్లజర్ల: అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేసి తమపై పని భారాన్ని తగ్గించాలని కోరుతూ విద్యుత్ శాఖ రెగ్యులర్ ఉద్యోగులు సోమవారం నల్లజర్లలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శన చేశారు. కారుణ్య నియామకాలు జరపాలని, పీఆర్సీ–20 అమలు చేయాలని ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లతో జిల్లా కేంద్రంలో మంగళంవారం నిర్వహించే ధర్నాకు ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నల్లజర్ల ఏడీఏ రాజబాబు, ఏఈ బాపిరాజు,లైన్ ఇన్‌స్పెక్టర్లు ఈదా డేవిడ్, నారాయణ, తాతారావు, వీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే చేయాలి

నిడదవోలు రూరల్: ఓటర్ల జాబితాలోని వివరాలపై పారదర్శకంగా సర్వే చేయాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సూచించారు. మండలంలోని గోపవరం, పురుషోత్తపల్లి గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వో) ఓటర్ల జాబితా జర్వే జరుపుతున్నారు. తహసీల్దార్ వారితో కలిసి సోమవారం ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన జాబితాలను పూర్తిచేయాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

దేవరపల్లి: ఆగస్టు నెల ఇంటింటికీ రేషన్ పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని దేవరపల్లి మండల పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు. ఈ నెల నుంచి అన్ని రేషన్ కార్డులకు ఫోర్టు ఫైడ్ బియ్యం, పంచదార ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.

స్పందనకు 11 అర్జీలు

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోరుతూ 12 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయం ఏవో జీఎస్ జవహర్ బాజీ ఆదేశించారు.

పలుచోట్ల క్రైస్తవుల శాంతి ర్యాలీలు

- మణిపూర్ ఘటనలకు నిరసనగా..
- బాధ్యులపై చర్యలకు డిమాండ్



కొవ్వూరు మెరక వీధిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

కొవ్వూరు: మణిపూర్‌లో క్రైస్తవులపైన, చర్చిలపైన జరిగిన దాడులను నిరసిస్తూ కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా పలుచోట్ల క్రైస్తవ సంఘాలు సోమవారం శాంతి ర్యాలీలు నిర్వహించాయి. కొవ్వూరు పట్టణ ఒకటో వార్డు శ్రీరామ కాలనీ నుంచి నిర్వహించిన ర్యాలీలో వందలాది క్రైస్తవులు, పాస్టర్‌లు పాల్గొన్నారు. మెరక వీధి జంక్షన్ వద్ద వారు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మణిపూర్ ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ, బాధితులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం వారంతా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. క్రిస్టియన్ జేఏసీ నాయకులు కె.సాక్షిబాబు, బొంతా శ్యాం రవిప్రకాష్, ఎల్.బుజ్జిబాబు, ఎస్.సామ్యూల్, ఈ.జోసెఫ్, జీఎం శామ్యూల్‌రాజు, ఏకే ప్రసాద్‌బాబు, సర్జన్‌బాబు, పెనుమాక జయరాజు, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

నల్లజర్ల: మణిపూర్ ఘటనలను నిరసిస్తూ యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లజర్లలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలం వద్ద నుంచి చెక్ పోస్టు సెంటర్ వరకూ వారు ప్రదర్శన చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, మోదీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

నిడదవోలు రూరల్: మణిపూర్‌లో శాంతియుత వాతావరణం కల్పించి, అక్కడి క్రైస్తవులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో మండలంలోని డి.ముప్పవరంలో మ్యుజీషియన్ ఫర్ క్రైస్ట్ టీమ్ సభ్యులు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు మోకాళ్లపై కూర్చొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ చిట్టిరాజు సారథ్యం వహించారు. కేఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు, జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు మద్దతు పలికారు. టీమ్ సభ్యులు ఎం.ప్రసాద్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: నియోజకవర్గ స్థాయి జాయింట్ యాక్షన్ క్రిస్టియన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బిషప్ బి.నవీన్ కుమార్ గౌరవాధ్యక్షుడు ఎం. ప్రపన్నకుమార్, కార్యదర్శి వి.రాంబాబు సారథ్యం వహించారు. స్థానిక గణేష్ చౌక్ సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఓవర్ బ్రిడ్జి, గాంధీ బొమ్మ సెంటర్ల మీదుగా తహసీల్దార్ ఆఫీసుకు చేరుకుంది. అక్కడ పాస్టర్లందరూ మోకాళ్లపై నిలబడి శాంతి ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ గంగరాజుకు వినతిపత్రం అందించారు. కె.షారోన్‌రాజు, పి. ఓబద్యా, బి. శామ్యూల్, టి. సువర్ణరాజు, ఎం. గుణ శామ్యూల్, కేఎస్ మణికుమార్, వివిధ ప్రాంతాల పాస్టర్లు పాల్గొన్నారు.



నల్లజర్లలో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు



డి.ముప్పవరంలో మ్యుజీషియన్ ఫర్ క్రైస్ట్ టీమ్ సభ్యుల నిరసన

ముక్కామలలో పొలం బడి

పెరవలి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. ముక్కామల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సోమవారం ఆయన పొలంబడి నిర్వహించారు. ఈ గ్రామంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే పెరవలి మండలం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం అన్న ప్రసాదానికి బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని రామకృష్ణ చెప్పారు. రైతులు కలిసి వస్తే మరింత ఎక్కువ మొత్తంలో సరఫరా చేయవచ్చన్నారు. ట్రైనర్ ఉమా మహేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దేవరపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని గౌరీపట్నం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని బందపురానికి చెందిన చోళ్ల మధు బైక్ కొవ్వూరు వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో అతడు గౌరీపట్నం వద్ద జాతీయ రహదారి పక్కనే మోపెడ్‌పై నిలబడి ఉన్న గౌరీపట్నానికే చెందిన ఆత్కూరి గంగారావును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.